ప్రజాశక్తి

ఆదివారం 23 ఏప్రిల్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఉక్కును పూర్తి సామర్థ్యంతో నడపాలి

సిపిఎం

హాజరైన సిపిఎం కార్యకర్తలు

తీర్మానం ప్రవేశపెడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీ కరణను తక్షణమే ఆపి పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం విశాఖ జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. శనివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. 32 మంది ప్రాణదానం, 62 గ్రామాల రైతులు 24 వేల ఎకరాల భూముల త్యాగం, 64 మంది కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పదవీ త్యాగాలతో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఆవిర్భవించిందని, దీంతో విశాఖ రూపురేఖలే మారిపోయాయని తీర్మానంలో గుర్తు చేశారు. ప్లాంట్ ఏర్పాటుకు నాటి కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.4980 కోట్లు పెట్టుబడి పెడితే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్టీల్‌ప్లాంట్ ఇంతవరకూ రూ.50 వేల కోట్లును పన్నులు, డివిడెండ్ల రూపంలో కట్టిందని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పిస్తోందని, ఎస్సీ, ఎస్టీ, బిసి, మహిళ, వికలాంగులకు రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం అందిస్తోందని పేర్కొన్నారు. రూ.3 లక్షల కోట్లు విలువైన ప్లాంట్‌ను కారుచౌకగా అమ్మేసే కుట్రలు కొనసాగుతున్నాయని తెలిపారు. కరోనా సమయంలో లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా చేసి దేశంలో వేలాది మంది ప్రాణాలను కాపాడిన సంజీవినిగా ప్లాంట్ నిలిచినట్టు తీర్మానంలో గుర్తు చేశారు. అటువంటి బంగారు బాతును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వంద శాతం అమ్మకానికి పెట్టిందని, దీనికి వ్యతిరేకంగా రెండు సంవత్సరాలకుపైగా ఉద్యమం నడుస్తోందని తెలిపారు. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం ఏదో ఒక విధంగా సంస్థను తనకు అనుకూలురైన కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్రలు సాగిస్తూనే ఉందని, ప్లాంట్‌కు ముడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్, రైల్వే రేక్స్ రాకుండా అడ్డుకుంటోందని పేర్కొన్నారు. ప్లాంట్‌లోని మూడో బ్లాస్ట్ ఫర్నేసును మూత వేసి, కావాలనే నష్టాల ఊబిలోకి నెడుతున్నారని తెలిపారు. సొంత గనులు కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇఒఐ ద్వారా ముడి సరుకు, వర్కింగ్ క్యాపిటల్ సేకరణకు యాజమాన్యం పూనుకుంటే దీనిలో ప్రభుత్వ రంగ సంస్థలు పాల్గొనకుండా కేంద్రం ఆటంకాలు సృష్టిస్తోందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను అష్టదిగ్బంధనం చేసి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నిందని తీర్మానంలో తెలిపారు. ఈ కుట్రలను సమావేశం మిగతా 2లో..

విద్యుత్ కాంతుల్లో అప్పన్న ఆలయం, సింహాచల పరిసర ప్రాంతాలు

నేడు అప్పన్న నిజరూప దర్శనం

చందనోత్సవానికి సర్వం సిద్ధం వార్త 4లో..

ఆదివాసీల సమస్యలపై 21న జాతీయ సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపితో సహా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 21న విశాఖ నగరంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జాతీయస్థాయి ఆదివాసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ నాయకులు ధర్మల సురేష్ (ఎపి), ముక్తి సత్యం (తెలంగాణ), కేదార్ సబర్ (ఒడిశా) తెలిపారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలోని అటవీ ప్రాంతాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పడానికి చారిత్రాత్మకమైన అటవీ హక్కుల చట్టం - 2006ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ క్రమంలోనే అటవీ హక్కుల సంరక్షణ చట్టం సవరణ, నియమాలు - 2022ని ముందుకు తెచ్చారని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ఉన్న సహజ వనరులను, అడవిని పూర్తిగా కార్పొరేట్లకు అప్పజెప్పే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ కుట్ర చేసిందని ఆరోపించారు. ఈ చర్యలతో అటవీ ప్రాంతంలో నివసిస్తున్న మిగతా 2లో..

లోపలి పేజీల్లో..

దక్షిణంలో జోరు పెంచిన సుధాకర్

విద్యాశాఖ సిబ్బందిపై చర్యలు హేయం

బిజెపి విధానాలపై పోరాటం చేయాలి

గెలిస్తే అమరావతి పూర్తిచేస్తా

విశాఖ నగరంలోని వన్ టౌన్ ఏరియాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిము సోదరులు

భక్తి శ్రద్ధలతో రంజాన్

విశాఖ, అనకాపల్లిల్లో మసీదులు కిటకిట వార్త 8లో..

ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ వెన్నెముక

◆ కోర్టులు సామాన్యులకు అందుబాటులో ఉండాలి ◆ సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు

మాట్లాడుతున్న లావు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - లీగల్ రిపోర్టర్

ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ వెన్నెముక అని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఉదయం నగరంలోని ఓ హోటల్‌లో కీర్తిశేషులు న్యాయ కోవిదుడు, విశాఖ మాజీ మేయర్ డివి.సుబ్బారావు స్మారకోపన్యాసంలో ఆయన ప్రధాన ప్రసంగం చేశారు. న్యాయవ్యవస్థ సామాన్యులకు సైతం అందుబాటులో ఉండాలని సూచించారు. సమాజంలో న్యాయవాదులు అంతర్భాగమని, వారిని వేరుగా చూడలేమని అన్నారు. డివి.సుబ్బారావు దేశవ్యాప్తంగా చేసిన ప్రసంగాలు, న్యాయస్థానాల్లో చూపిన చతురత మరిచిపోలేమన్నారు. ప్రజాస్వామ్యం అన్నిటికంటే ఉన్నతమైందని, దానికి విఘాతం కలిగితే న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరించే అధికారం ఉందని అన్నారు. భారత రాజ్యాంగంలోని 141, 144 అధికరణాలను ప్రస్తావించారు. ఆయుధాలతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలమా ? అని ప్రశ్నించారు. పార్లమెంటు, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థలతో పాటు న్యాయస్థానాల పరిధిని విశ్లేషించారు. కార్యనిర్వాహక వ్యవహారాల్లో పాలకుల జోక్యం తగదని, అటువంటి సందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం స్పందిస్తుందని అన్నారు. ఇందుకు సంబంధించిన పలు కేసులను వివరించారు. న్యాయవ్యవస్థ సామాన్యుడికి, కార్యనిర్వాహక వ్యవస్థకూ మధ్య వారధి అని పేర్కొన్నారు. పరిపాలన అంశాలలో న్యాయవ్యవస్థ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

అమరులకు నివాళ్లర్పిస్తున్న నేతలు

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

తీవ్రంగా గర్హించింది. ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేసింది.

సుబ్బారావు, సత్యనారాయణ, కృష్ణమూర్తిలకు నివాళి

ఇటీవల మరణించిన ఉద్యమ నేతలు జి.సుబ్బారావు, మళ్ల సత్యనారాయణ, వి.కృష్ణమూర్తిలకు సమావేశం నివాళ్లర్పించింది. వారి చిత్రపటాలకు పార్టీ సీనియర్ నాయకులు జివిఎన్ చలపతి, వై.రాజు, అరుణ్ జీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ అమరుల ఆశయాల సాధనకు కార్యకర్తలందరూ కృషి చేయడమే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాస్, జిల్లా నాయకులు పి.మణి, ఎం.రాంబాబు, వి.కృష్ణారావు, ఎం.సుబ్బారావు, పి.పైడిరాజు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ వెన్నెముక

ఎప్పుడూ ప్రజా పక్షమే అని వివరించారు. వివిధ నేరాల్లో జైల్లో మగ్గుతున్న ఖైదీల హక్కుల పరిరక్షణ, వారి జీవన పరిస్థితులు, మానవ హక్కుల పరిరక్షణ వంటి విషయాలపై ప్రభుత్వాలు తమ హద్దులు దాటవద్దన్నారు. పిల్లలు, మహిళలు, వృద్ధుల హక్కుల పరిరక్షణ ప్రభుత్వం బాధ్యతని తెలిపారు. గాలి, నీరు, సూర్యరశ్మి వంటి అంశాలు, కాలుష్యంపై 2050 నాటికి తీవ్ర మార్పులు వచ్చే అవకాశం ఉందని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని. హెచ్చరించారు. పారదర్శకంగా పాలకులు వ్యవహరించాలని సూచించారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, డివి సుబ్బారావు కుమారుడు జస్టిస్ డివిఎస్ఎస్.సోమయాజులు, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్న కుమార్, తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ మాంధాత సీతారామమూర్తి, జ్యోతిర్మయి, పలువురు న్యాయమూర్తులు, న్యాయాధికారులు, రాష్ట్ర ఉన్నత విద్య నియంత్రణ కమిటీ సభ్యులు, గాయత్రీ విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సీనియర్ సభ్యులు ఎస్.కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యలపై 21న జాతీయ సదస్సు

లక్షలాదిమంది ఆదివాసీలను వారి ప్రాంతాల నుంచి, జీవనోపాధి నుంచి సమూలంగా దూరం చేయనున్నారన్నారు. ఈ సమస్యలపై చర్చించి తగు పోరాట కార్యక్రమాన్ని రూపొందించడం కోసం జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తీరాన్ని శుభ్రపరుస్తున్న కళంజియ సమాఖ్య సభ్యులు

బీచ్ క్లీనింగ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ మత్స్యకారుల కళంజియ సమాఖ్య సభ్యులు శనివారం ఎర్త్ డే సందర్భంగా కొత్త జాలారిపేట, నావెల్ క్యాంటీన్ ఎదురుగా ఉన్న గంగమ్మ తల్లి గుడి సమీపంలో బీచ్‌ను శుభ్రం చేశారు. వ్యర్థాలను ఏరి, సంచుల్లో వేసి దూర ప్రాంతాలకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ భూమిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో కళంజియ నాయకులు రామయ్య, అయ్యప్ప, ధాన్ ఫౌండేషన్ రీజనల్ కో-ఆర్డినేటర్ శైలజ, రామ్ కుమార్‌తో పాటు, లోకేష్, ధనలక్ష్మి, పృధ్వీ, రజిని తదితరులు పాల్గొన్నారు.

పాత పాటే..!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రతీకారాన్ని తీర్చుకోవడం కాదు. దాన్ని భరించడం వీరత్వం' అంటూ ప్రపంచ ప్రఖ్యాత రచయిత షేక్స్‌పియర్ చేసిన వ్యాఖ్య తెలిసిందే. ప్రస్తుత పాలకులు గత పాలకులు చేసిన పనులనే మళ్లీ మళ్లీ ప్రారంభించడమో, శంకుస్థాపన, భూమి పూజలు చేయడమో గమనిస్తే పై సామెత వీరికి ఎంత మాత్రమూ పట్టదు అన్నది స్పష్టమవుతుంది. అలాగే ఒక విషయాన్ని పలుసార్లు చెప్పాల్సి వస్తున్నప్పుడో.. లేదంటే ఒకే పనికి పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతూ ఉంటేనో, అది కూడా ఒక ప్రముఖుని కోసమో ఇలా జరిగితే 'రెడ్డొచ్చే మొదలెట్టే!.. అనడం ఆనవాయితీ. విశాఖలో ఈ తరహా పనులే ప్రభుత్వం చేపడుతూ ప్రజల దృష్టిలో పలుచన అవుతుండటం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లాలో పర్యటనకు విచ్చేసిన సందర్భంలో ఈ ఏడాది సెప్టెంబర్‌లో విశాఖలో తాను వచ్చి పరిపాలన సాగించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. జులైలో అంటూ ఇటీవల వరకూ ఇదే స్థాయి ప్రచారం జరిగింది. గడిచిన మూడేళ్లుగా మే, జులై నెలలు ఈ రకంగా పాపులర్ అయ్యాయి.

పాత వాటికే మళ్లీ శంకుస్థాపనలు

వార్డు స్థాయిల్లో 'పాత' తగాదాలు ప్రతిచోటా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన మంచినీటి పథకాన్నో, బోరునో మరలా ఇప్పుడు అధికార పార్టీ వాళ్లు ప్రారంభించారని పదేపదే ఈ ఆరోపణలు వినిపిస్తుండడం తెలిసిందే. తాజాగా స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ పనికి పూనుకోవడం విశేషం. అంతేగాక మే 3న విశాఖకు వైఎస్ జగన్ విచ్చేయనున్నట్లు ప్రభుత్వం వైపు నుంచి కొంతమంది లీకులు వదులుతున్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన, మధురవాడ ఐటి హిల్స్‌పై 130 ఎకరాలను అదానీ డేటా సెంటర్ కోసం కేటాయించిన స్థలంలో భూమి పూజను సిఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా చేపడతారన్నది ఈ ప్రచారం సారాంశం. వాస్తవానికి ఈ రెండింటికీ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే శంకుస్థాపనలు

జరిగాయి. ఆ పేరుతో మరలా ప్రభుత్వ ధనం వృథా చేయడం అనేది ఒకరకంగా అనవసరమైన చర్యగా ప్రజానీకం నుంచే కాదు సిఎం వైఎస్ జగన్ సొంత పార్టీ నేతలు కూడా తాజాగా వ్యాఖ్యానం చేస్తున్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు సంబంధించి పిఎం నరేంద్రమోడీ చేత శంకుస్థాపన చేయిస్తామని బిజెపి పెద్దలు ప్రచారం చేసి మరీ చతికిలపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కూడా ఈ పనిలో విఫలమయ్యారు. రైల్వే జోన్ పనుల ప్రారంభం విషయంలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకులు వైఫల్యం చెందారు.

కొనసాగుతున్న ఆరోపణలు

వైఎస్ జగన్ అదానీ సెంటర్‌కు భూ కేటాయింపులను అత్యంత అడ్డగోలుగా కేటాయించడంపై విమర్శలు అన్ని తరగతుల ప్రజానీకం నుంచీ వస్తున్నా వెనక్కి తగ్గలేదు. మే 3న దాన్ని ప్రారంభించడానికి సిఎం రావడంపై మేధావులంతా ఎద్దేవా చేస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుడు ప్రాజెక్టులు, ప్రతిపాదనలు, కేటాయింపులను కాస్త అటు ఇటూ మార్చేసి ఆ ప్రభుత్వం కంటే తాను గొప్పగా చేశాననిపించుకునే 'వ్యూహం' ఒకటైతే, గతంపై ప్రతీకారం తీర్చుకునేలా ఈ సర్కారు వ్యవహరిస్తుందన్నది తాజా ఘటనలతో రూఢీ అవుతోంది. ఎపి టిడ్కో ఇళ్లపైనా ఇదే తరహా వైఖరితో ప్రభుత్వం విశాఖలో 20 వేల ఇళ్లకు మోక్షం కలుగకుండా తాను కొత్తగా ఇస్తున్నట్లు ప్రకటించి ఇంతవరకూ పూర్తిచేయలేదు. పంచ గ్రామాలకు సంబంధించి గతంలో ఇచ్చిన పట్టాలు చెల్లవని, తమ ప్రభుత్వం కొత్త విధానంతో వెళ్తుందని చెప్పి ఎటూ తేల్చకుండా జీవోలతో కాలయాపన చేయడం తెలిసిందే. నగరంలోని అల్లూరి సీతారామరాజు నగర్ (ఎఎస్ఆర్ నగర్, ఉత్తర నియోజకవర్గం)లో పేదల 160 ఇళ్లకు గతంలోనే అనుమతులు వచ్చి పునాదులు వరకూ వచ్చినా వీటిని నిలిపేసి రీ టెండరింగ్ పేరుతో పనులు పూర్తికాకుండా మూడున్నరేళ్లుగా నాన్చడం జగన్ సర్కారు విధానాన్ని తెలియజేస్తోంది.

751వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా అన్ని కార్మిక సంఘాల ఐక్యతతో ఎదుర్కొంటామని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారానికి 751వ రోజుకు చేరాయి. దీక్షల్లో బిహెచ్ఇఎల్‌లోని ఐఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లకుపైగా కార్మికులు, ప్రజలు పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తామని ముందుకెళ్లడం దారుణమన్నారు. ఇది దేశానికి నష్టమన్నారు. దీక్షల్లో సంఘం నాయకులు బి.ఆనంద్‌రావు, వైఎస్.బాబూరావు, సిహెచ్.మురళీశ్వరరావు, పి.ఆనంద్ కుమార్, పివి.అప్పారావు, డి.నరసింగరావు, వై.దేవుడు పాల్గొన్నారు.

దీక్షల్లో కూర్చున్న ఐఎన్‌టియుసి కార్యకర్తలు

విద్యాశాఖ సిబ్బందిపై చర్యలు హేయం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పార్వతీపురం మన్యం జిల్లాలో రాష్ట్ర విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలో డిఇఒ, వీరఘట్టం ఎంఇఒ, కెజిబివి ప్రిన్సిపల్, జిసిడిఒ అధికారులపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం హేయమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గణిత శాస్త్ర పాఠ్య పుస్తకాన్ని పంపిణీ చెయ్యలేదనే చిన్న కారణంతో సస్పెన్షన్ చేసి ఉపాధ్యాయులపై ఒత్తిడిని తీసుకువచ్చి భయభ్రాంతులకు గురి చేయడం సమంజసం కాదని తెలిపారు. తక్షణమే సస్పెన్షన్ చర్యలను వెనక్కు తీసుకోవాలని కోరారు.

దక్షిణంలో జోరు పెంచిన సుధాకర్

వార్డుల్లో సేవా కార్యక్రమాలు

ఆయన వెంటే పలువురు కార్పొరేటర్లు ?

ప్రజాశక్తి - సీతమ్మధార

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వైసిపి నేత సీతంరాజు సుధాకర్ మళ్లీ జోరు పెంచారు. రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన పోటీ చేయాలని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే పలువురు కార్పొరేటర్లుతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించారు. కొంతమంది కార్పొరేటర్లు ఆయనకు మద్దతు ప్రకటించినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ నియోజకవర్గం నుంచి వాసుపల్లి గణేష్ కమార్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన టిడిపి నుంచి గెలిచి వైసిపిలో చేరిన సంగతి తెలిసిందే. ఆయన తీరును పలువురు కార్పొరేటర్లు ఇప్పటికీ బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారు. కొంతమంది తిరుగుబాటు ప్రకటించారు. ఇటువంటి వారంతా సీతంరాజు సుధాకర్ వెంట ఉన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో నిలిచిన సుధాకర్ ప్రభుత్వంపై పట్టభద్రుల్లో వెల్లువెత్తిన వ్యతిరేకత వల్ల పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అయినప్పటికీ దిగాలు చెందక మళ్లీ దక్షిణ నియోజకవర్గంలో కార్యక్రమాల జోరు పెంచారు. వార్డుల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కరోనా ఫస్ట్, సెకెండ్ వేవ్‌ల్లో నియోజకవర్గంలో అందరికీ నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్లను ఆయన పంపిణీ చేసి మెప్పు పొందారు. 6800 కుటుంబాలకు సీమంతాలు నిర్వహించారు 30 వేల మందికి చీరలు పంచిపెట్టారు. 30 వేల గడియారాలు అందజేశారు. వార్డుల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. అలాగే కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలిచారు. ఇటీవల కాలంలో మళ్లీ ఈ సేవలను పునరుద్ధరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి చెందిన మరుసటి రోజు నుంచే ఈ నియోజకవర్గంపై దృష్టి సారించిన ఆయన వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పార్టీ మారుతారన్న ఊహాగానాలు చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు గందరగోళపడకుండా సమావేశాలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. గతంలో కీర్తిశేషులు ద్రోణంరాజు శ్రీనివాస్ ఈ నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. సీతంరాజు సుధాకర్ ఆయనలేని లోటును భర్తీ చేస్తారని వైసిపి కార్యకర్తలు చెబుతున్నారు. సుధాకర్ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా అందించిన సేవలను వారు గుర్తు చేస్తున్నారు.

సీమంతాలు నిర్వహిస్తున్న సీతంరాజు సుధాకర్ (ఫైల్‌ఫొటో)

ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు సన్నాహాలు

-జెజెఎం పథకం కింద ఏడాది క్రితం ప్రతిపాదనలు

-ఎట్టకేలకు నిధులు మంజూరు

-యుద్ధ ప్రాతిపదికన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారు. జలజీవన్ మిషన్ పథకం కింద పలు గ్రామాల్లో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా 20 నుంచి 40 కిలోలీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం చేపట్టారు. వాటర్ ట్యాంక్‌ల నుంచి పైపుల ద్వారా తాగు నీరు సరఫరా చేసి, ఇంటింటికి కుళాయిల ద్వారా అందించేందుకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి.

ఏడాది క్రితం ప్రతిపాదనలు... ఎట్టకేలకు నిధులు మంజూరు..

పలు గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి నివారణకు గానూ గతేడాది ఫిబ్రవరిలో అధికారులు చేసిన ప్రతిపాదనలు ఏడాది తర్వాత ఆమోదం పొంది నిధులు మంజూరయ్యాయి. రెట్రో ఫిటింగ్ నిధులు దాకమర్రికి రూ.26.10లక్షలు, మజ్జిపేటకు రూ.45.54 లక్షలు, సింగనబందకు రూ.17.36 లక్షలు, మజ్జివలసకు రూ.33.4 లక్షలు, టి.నగరపాలెంనకు రూ.44.76 లక్షలు, టి.నగరపాలెం పంచాయతీ గొల్లలపాలెంనకు రూ.15.60 లక్షలు, మూలకుద్దుకు రూ.15.20 లక్షలు, పాత మూలకుద్దుకు రూ.26.62లక్షలు, లక్ష్మీపురం పంచాయతీ కరగానిపేటకు రూ.13.19 లక్షలు, అమనాం పంచాయతీ జీరుపేటకు రూ.12.10 లక్షలు అదే పంచాయతీ నర్సయ్యపేటకు రూ.13.30లక్షలు, అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపేటకు రూ.27.40 లక్షలు, చిప్పాడ పంచాయతీ సిటీనగర్‌కు రూ.32.06 లక్షలు, చిప్పాడకు రూ.35.14 లక్షలు మంజూరయ్యాయి.

ఆర్గుమెంటేషన్ నిధులు

లక్ష్మీపురం పంచాయతీకి రూ.59.36 లక్షలు, అమనాంనకు రూ.46.40 లక్షలు, నీలయ్యమ్మ సత్రానికి రూ.15.01లక్షలు, నారాయణరాజుపేటకు రూ.15లక్షలు, సింగనబందకు రూ.17లక్షలు, మజ్జిపేటకు రూ.17.40 లక్షలు, మజ్జివలసకు రూ.25లక్షలు, తాటితూరుకు రూ.32 లక్షలు, నరసయ్యపేటకు రూ.16.20 లక్షలు, ఎరుసుపేటకు రూ.17.99 లక్షలు, రెల్లిపేటకు రూ.7.50 లక్షలు మంజూరయ్యాయి.

7 గ్రామాల్లో ట్యాంక్‌ల నిర్మాణం

జల జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగు నీరు సరఫరా చేయాలన్న ఉద్దేశ్యంతో భీమిలి మండలంలోని 7 గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు ప్రారంభించాం. తాటితూరు, అమనాం, లక్ష్మీపురం గ్రామాల్లో చెరో 40 కిలోలీటర్ల సామర్థ్యం, జీరుపేట, మజ్జివలస, మజ్జిపేట, టి.నగరపాలెంలో చెరో 20 కిలోలీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌లు నిర్మించనున్నాం. జెజెఎం నిధులు రెండు స్కీమ్‌ల కింద మంజూరయ్యాయి. రెట్రో ఫిటింగ్ కింద రూ.3 కోట్లా 64 లక్షలా 61వేలు, ఆర్గుమెంటేషన్ కింద రూ.2 కోట్లా 68లక్షలా 86 వేలు మంజూరయ్యాయి.

పి.శుభలక్ష్మి,
ఎఇఇ, ఆర్‌డబ్ల్యుఎస్
భీమిలి మండలం

కల్వర్టు నిర్మాణం చేపట్టండి

ప్రజాశక్తి -మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు పరిధిలో నగరంపాలెం గ్రామంలో కల్వర్టు పనులను తక్షణమే పూర్తిచేయాలని సిపిఐ నాయకుడు వాండ్రసి సత్యనారాయణ కోరారు. గ్రామంలో కల్వర్టు పాడవడంతో దాని స్థానంలో కొత్త నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. కొత్త కల్వర్టు నిర్మాణం కోసం పనులు చేపట్టి తవ్వి వదిలిపెట్టారని, దీంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వృద్ధులు, పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు పనులు చేపట్టాలని కోరారు.

రోడ్డుపై వేసిన మట్టి దిబ్బ

సర్వీస్ రోడ్డులో మట్టి దిబ్బ

ప్రజాశక్తి -ఆనందపురం : పెద్దిపాలెం జాతీయ రహదారి పారడైజ్ హోటల్ దగ్గర సర్వీసు రోడ్డు మధ్యలో వదిలేసిన మట్టి దిబ్బ ప్రమాదాలకు నిలయంగా మారింది. సర్వీసు రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డును తవ్వి మట్టిదిబ్బగా వదిలేశారు. ఈ మట్టి దిబ్బ వల్ల వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రివేళ దగ్గరకు వచ్చిన వరకు కనబడకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో హెచ్చరిక బోర్డు గాని, లైట్లు గాని ఏర్పాటు చేసినట్లయితే కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

కళాశాల సిఇఒ, ప్రిన్సిపల్‌తో టేబుల్ టెన్నిస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

టేబుల్ టెన్నిస్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -తగరపువలస : డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యాన నారాయణ దంత వైద్య కళాశాలలో ఈ నెల 12 నుంచి 16వ తేదీ వరకు జరిగిన 25వ అంతర్ కళాశాల స్పోర్ట్స్ మీట్‌లో స్థానిక సంగివలస ఎన్‌ఆర్‌ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల సిఇఒ నిరంజన్ కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ రాధామాధవ్ త్రిపాఠి, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి, దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి, పరిపాలనా విభాగం అధికారి శివప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ గన్నాజి కళాశాలలో అభినందించారు

యువకులను కాపాడిన లైఫ్ గార్డులు

ప్రజాశక్తి -మధురవాడ : సముద్రస్నానాలకు దిగి ప్రమాదానికి గురైన రాయపూర్‌కు చెందిన ముగ్గురు యువకులను లైఫ్ గార్డులు రక్షించిన ఘటన శనివారం కథనం ప్రకారం... రాయపూర్ నుంచి విశాఖకు విహార యాత్రకు వచ్చిన ముగ్గురు యువకులు రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగారు. ప్రచా అనీల్, నివార అదిల్, అశోక్ అదిల్ సముద్రస్నానాలు చేస్తూ బాగా లోపలికి వెళ్లిపోయారు. ఇంతల్లో పెద్ద కెరటం వచ్చి లాగడంతో ప్రమాదానికి గురయ్యారు. వారు పెద్దగా కేకలు వేయడంతో అక్కడ విధులు నిర్వర్తిస్తున్న జివిఎంసి కమ్యూనిటీగార్డులు, లైఫ్ గార్డులు రక్షించారు. మెరైన్ పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఆస్కార్ అవార్డు సినిమా ప్రదర్శన

ప్రజాశక్తిసీతమ్మధార: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న మూడు రోజుల ఆస్కార్ అవార్డుల ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా రెండవ రోజు శనివారం ఆస్కార్ బెస్ట్ ఫిల్మ్, 7 అవార్డులు పొందిన 'ఎవ్విర్ థింగ్ ఎవ్విర్ వేరే అల్ అత్ ఓన్స్' సినిమాను ప్రదర్శించారు. ప్రదర్శనకు ముందు జరిగిన సమావేశంలో ఎయు మాజీ రెక్టర్ ఆచార్య ఎం.ప్రసాద రావు మాట్లాడుతూ, ఆస్కార్ చిత్రాలను ప్రదర్శిస్తున్న ఫిల్మ్ సొసైటీని అభినందించారు. ఫిల్మ్ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి విశాఖ అనువైనదని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహణకు కూడా వైజాగ్ అనువైనదని, ఆదిశగా ప్రభుత్వాలు ఆలోచించాలని కోరారు. ఈ సమావేశంలో నరవ ప్రకాశ రావు, బి.చిన్నారావు, అనురాధ, హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నుంచి వస్తున్న వ్యర్థాల నీరు

పొంగిపొర్లుతున్న డ్రెయినేజీ

ప్రజాశక్తి-సీతమ్మధార : పౌర గ్రంథాలయం ఎదురుగా డ్రెయినేజీ పొంగిపొర్లడం ద్వారా వస్తున్న దుర్వాసనతో విద్యార్థులు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దుర్వాసనతో పబ్లిక్ లైబ్రరీకి వచ్చే విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జివిఎంసి అధికారులు చొరవ చూపి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వర రాగ తరంగిణి, స్వరార్చన సంయుక్తంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన శత పురుషుడు, యుగ పురుషుడు శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మహ్మద్ ఖాన్ హాజరై మాట్లాడారు. ఎన్‌టిఆర్, అక్కినేని నటించిన చిత్ర గీతాలతో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. తెలుగు చలన చిత్రసీమలో ఎన్‌టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు రెండు కళ్లు అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అల్లిపిల్లి నర్సింగరావు, సత్యవతి పాడిన రా వెన్నెలదొరా, భూపతిరావు, కల్యాణి పాడిన వసంతగాలికి, పోలీస్ నర్సింగ్, ఎన్.రాజేశ్వరి పలుకరించితేనే, భూపతి, రాధారాణి పాడిన ఓ చిన్నదానా తదితర పాటలతో ఎన్‌టిఆర్, అక్కినేనికి నివాళు లర్పించారు. రాధారాణి వ్యాఖ్యాతగా వ్యవహరించిన కార్యక్రమంలో ఘంటసాల క్రీడా సాంస్కృతిక సంఘం కార్యదర్శి చెన్నా తిరుమలరావు, సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి, ఇరు సంస్థల అధ్యక్షులు డి.భూపతిరావు, అల్లిపిల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

పలుచోట్ల ధరిత్రి దినోత్సవం

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్

ప్రజాశక్తి -యంత్రాంగం

ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని విశాఖ జిల్లాలో పలుచోట్ల శనివారం ఘనంగా నిర్వహించారు.

భీమునిపట్నం : స్థానిక కుమ్మరిపాలెం ప్రకృతి స్కూల్‌లో ధరిత్రి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వడలి శ్రీనివాస్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై మరింతగా అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఆనంద్ మాట్లాడుతూ, కాలుష్యం వల్ల కలిగే నష్టాన్ని వివరించారు. కిడ్ పవర్ సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పలు అంశాలపై విద్యార్థులకు చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. నాటిక ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్స్ అండ్ కిడ్ పవర్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కిడ్ పవర్ సంస్థ కో ఆర్డినేటర్ నగేష్, ఇన్‌ఛార్జి పద్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధురవాడ : ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యాన నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ పర్యావరణశాస్త్ర విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో సైన్స్ కోర్సుల డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడుతున్న క్లోరో ఫ్లోరో కార్బన్ ఉద్గారాలు భూగ్రహన్ని మరింతగా వేడెక్కిస్తున్నాయని, దీని వల్ల పర్యావరణంలో పెను మార్పులు చోటు చేసుకొని జీవరాశుల మనుగడకు ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఏకతాటిపైకి వచ్చి ధరిత్రిని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ శాస్త్ర విభాగం సీనియర్ ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంఘ బహిష్కరణ అనాగరిక చర్య

మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - తగరపువలస : తన అభిప్రాయాన్ని బహిర్గతంగా వెల్లడించిన పద్మ శాలి సేవా సంఘం సభ్యుడు గిడుతూరి శ్రీనివాసరావును నేటి ఆధునిక యుగంలోనూ కులం, సంఘం నుంచి బహిష్కరిస్తూ స్థానిక పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు కొప్పల రమేష్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది అనాగరిక చర్య అని మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ అన్నారు. బాధితుడు శ్రీనివాసరావుతో కలిసి శనివారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంతపేట, ఎల్లారమ్మ చదును దగ్గర ఏర్పాటు చేసిన హుండీ ద్వారా వచ్చే ఆదాయాన్ని చదును అభివృద్ధికే ఖర్చు చేయాలని అడిగినందుకు శ్రీనివాసరావుపై అతని కుటుంబ సభ్యుల సమక్షంలోనే రమేష్ భౌతిక దాడికి దిగారని ఆరోపించారు. పద్మశాలి సంఘం, కులం నుంచి బహిష్కరిస్తున్నట్లు సంఘ సభ్యులచే తీర్మానం చేయడం దుర్మార్గమని ఖండించారు. ఈ సమావేశంలో బాధితుడు శ్రీనివాసరావుతో పాటు కౌన్సిల్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎస్వీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.నాయుడు పాల్గొన్నారు.

రమేష్‌పై చర్యలు తీసుకోవాలి : టిడిపి

పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిలో ఉండడాన్ని జీర్ణించుకోలేకనే ఏదో కారణం చూపి గిడుతూరి శ్రీనివాసరావుపై ప్రస్తుత వైసిపి నాయకులు కొప్పల రమేష్ శుక్రవారం సంఘ సమావేశానికి పిలిచి అకారణంగా దాడికి పాల్పడినట్లు టిడిపి జిల్లా కార్యదర్శి పిట్టా సురేష్, పార్టీ రెండో వార్డు అధ్యక్ష, కార్యదర్శులు బడిగింటి నీలకంఠం, కార్యదర్శి పిట్టా వెంకటరావు, పార్టీ ఒకటో వార్డు కార్యదర్శి వానపల్లి సత్య ఆరోపించారు. శ్రీనివాసరావుపై దాడిచేసి, కుల, సంఘ బహిష్కరణ చేసిన రమేష్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీవో, తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు జోగ సన్యాసిరావు, గరే చంద్రమౌళి, ఎం.కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

దాడి అవాస్తవం : రమేష్

పద్మశాలి సేవా సంఘం సభ్యులు గిడుతూరి శ్రీనివాసరావుపై తాను దాడి చేసినట్లుగా చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని సంఘం అధ్యక్షులు కొప్పల రమేష్ పేర్కొన్నారు. సంఘ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పద్మశాలి సేవా సంఘం ప్రతిష్టను వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా దిగజారుస్తుండడంపై కొంత మంది సభ్యులతో కలిసి శ్రీనివాసరావును ప్రశ్నించాను తప్పితే, అతనిపై భౌతిక దాడికి దిగలేదని వివరణ ఇచ్చారు.

కనకరాజును సన్మానిస్తున్న సిఐ లూథర్‌బాబు, ఎస్ఐ దేవుడమ్మ

కనకరాజును ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి -ములగాడ : వివిధ పతకాలను సాధించిన అథ్లెటిక్ ఛాంపియన్, పరుగులు వీరుడు ఆకులు కనకరాజును యువత ఆదర్శంగా తీసుకోవాలని మల్కాపురం సిఐ లూథర్‌బాబు కోరారు. మల్కాపురం పోలీస్‌స్టేషన్‌లో ఆకులు కనకరాజును సత్కరించారు. ఈ సందర్భంగా లూథర్‌బాబు మాట్లాడుతూ, ఆకుల కనకరాజు ఎంతోమందికి ఆదర్శంగా నిలిచాడన్నారు. ఆయనకు వయసు 70 సంవత్సరాలు అయినా యువతలా ఉంటాడని పేర్కొన్నారు. స్టేషన్ పరిధిలో కొత్త మెన్‌కు ఆయన ద్వారా శిక్షణ ఇప్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. పరుగులు వీరుడు ఆకులు కనకరాజు మాట్లాడుతూ, ఎంతోమంది యువతకు వివిధ క్రీడల్లో తాను శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దేవుడమ్మ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

108 కొబ్బరికాయలు కొట్టిన టిడిపి నాయకులు

'యువగళానికి' 108 కొబ్బరి కాయలు

ప్రజాశక్తి-పెందుర్తి : టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న 'యువగళం' పాదయాత్ర 1000 కిలోమీటర్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు ఆధ్వర్యాన పెందుర్తి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. పాదయాత్ర దిగ్విజయంగా పూర్తికావాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లోకేష్ చేస్తున్న యువగళానికి మంచి స్పందన వస్తుందన్నారు. ఆయన పాదయాత్ర చేస్తుంటే వైసిపి నాయకుల్లో దడ పుడుతుందని పేర్కొన్నారు. 2024లో మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు అవగడ్డ అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు కరక దేముడు, రెడ్డి నారాయణరావు, కొరుబిల్లి సుందరరావు, దాట్ల మధు, కాగిత రమణ, శ్రీను యాదవ్, గొంప త్రినాథ్, జిల్లా తెలుగు యువత నాయకులు డైలీ రమణ, గంతకొరు శ్రీను, గాంతకోరు శివ,దాసరి గణేష్, ఇప్పులి శివ, హేమంత్, చక్రి పాల్గొన్నారు.

26న బహిరంగసభను జయప్రదంచేయాలి

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 63వ వార్డు పరిధి కాకరలోవ జంక్షన్లో ఈ నెల 26వ తేదీన నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పశ్చిమ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, సహయ కార్యదర్శి గుడాల రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. అనంతరం కాకరలోవలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూనెల సూరిబాబు, ఎన్‌వి.త్రినాథ్, బి.గోపి, కనకరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన భవన ప్రారంభం

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 49వ వార్డు ఎన్‌జిజిఒఎస్ కాలనీలో వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మ అలివేలుమంగ అన్నసమారాధన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ పురస్కార గ్రహీత త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి, విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వైసిపి రీజనల్ కో- ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైసిపి జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు పాల్గొన్నారు.

నేడు అప్పన్న నిజరూప దర్శనం

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్న ఆదివారం నిజరూప దర్శనమివ్వనున్నారు. అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి కుటుంబ సభ్యులతో కలిసి తొలి దర్శనం చేసుకుంటారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఆ తర్వాత ట్రస్టు బోర్డు సభ్యులకు, సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తారు. చందనంతో నిండి ఉన్న స్వామివారిపై చందనాని తొలగించి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి దర్శనం కల్పిస్తారు. ఇప్పటికే ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాటుచేశారు. ఎండ వేడిమి నుంచి రక్షణకు టెంట్‌లు వేశారు. కాలు కాలకుండా కింద ఎక్కడికక్కడ కూల్ పెయింట్ వేయించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అతి కొద్ది మందికి మాత్రమే వాహనాలను కొండపైకి అనుమతిస్తారు. అంబులెన్స్‌లను, ఉచిత వైద్య సేవలను అందుబాటులో ఉంచారు. స్వచ్ఛంద సేవా సంఘాల ఆధ్వర్యాన మజ్జిగ, తాగునీరు, పాలు, బిస్కెట్లు అందించే ఏర్పాట్లు చేశారు. అగ్నిమాపక వాహనాలను కూడా అందుబాటులో ఉంచారు. స్వామి వారిపై ఉంచేందుకు అరగదీసిన చందన సుగంధ ద్రవ్యాలను మిళితం చేసి బాండాగారంలో భద్రపరిచారు.

తెల్లవారితే దర్శనాలున్నా పిఆ ఆఫీస్ చుట్టూ దర్శనం టికెట్ల కోసం భక్తులు ప్రదక్షిణ చేస్తున్నారు. సరైన సమాచారం లేక టికెట్ల కోసం తిరుగుతున్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామన్నా అది మాటలకే పరిమితమైని పలువురు ఆరోపిస్తున్నారు. విఐపిలకు, రాజకీయ నాయకులకు, ట్రస్ట్ బోర్డు సభ్యులకే టికెట్లలో పెద్దపీట వేసినట్లు భక్తులు ఆరోపిస్తున్నారు.

వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రానికి రోగుల తాకిడి

ప్రజాశక్తి- కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు పరిధి 5వ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజుకు దాదాపు 100 మందికి పైగా రోగులు వస్తున్నారు. వైద్యులు అందుబాటులో ఉండడంతోపాటు మెరుగైన వైద్య సేవలందించడంతో రోగులు ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ఈ ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారు. ప్రతిరోజు వైద్యాధికారి ఎఎల్.శాంతి అందుబాటులో ఉంటున్నారు. వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి నిపుణులైన డాక్టర్లు అందుబాటులో ఉండడం విశేషం. ప్రత్యేక నిపుణులు సోమవారం ఆర్థోపెడిక్, మంగళవారం గైనకాలజీ డెర్మటాలజీ, బుధవారం పల్మనాలజిస్ట్, గురువారం పిడియాట్రిక్, శుక్రవారం జనరల్ చికిత్స, శనివారం పల్మనాలజీ వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్లు నిర్వహిస్తున్నారు. ఆయా రోజుల్లో 120 మందికి పైబడి రోగులు వస్తారు. ఆరోగ్య పరీక్షలు కూడా ఇక్కడే నిర్వహిస్తున్నారు. మందులు ఉచితంగా అందజేస్తున్నారు. వైద్యానికి వచ్చిన రోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆసుపత్రి సిబ్బంది జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఆరోగ్య కేంద్రంలో సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ల్యాబ్ టెక్నీషియన్లు, రక్త పరీక్షలకు ల్యాబ్ సామాగ్రిని అందుబాటులో ఉంచారు. ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రక్త పరీక్షల వివరాలు. టిఎస్‌సి (తెల్ల రక్త కణాల లెక్కింపు), డిఎస్‌సి (ఐదు రకాల రక్త కణాలకు సంబంధించిన పరీక్ష), ప్లేట్ లెట్స్ కౌంట్, ఎస్ బైలి రూబిన్ (కామెర్లు), ఆర్‌పిఆర్, డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్, స్టూల్ ఫర్ ఓవా ఆండ్ సిస్ట్ (విరోచనాలకు సంబంధించి), టీబీ అండ్ డాట్స్ (క్షయకు సంబంధించి) ఇలా 22 రకాల రక్త పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

జిబి సిండ్రోమ్ వ్యాధిగ్రస్తునికి సాయం

లక్ష్మీనారాయణ ద్వారా సాయం అందిస్తున్న పట్టా ఫౌండేషన్

ప్రజాశక్తి-సీతమ్మధార : అరుదైన వ్యాధి జిబి సిండ్రోమ్‌తో బాధపడుతున్న కావ్య కుటుంబానికి పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యాన రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని సంస్థ అధ్యక్షులు పట్టా రమేష్ అందించారు. 2015వ సంవత్సరము నుంచి కావ్య ఈ వ్యాధితో బాధపడుతూ ముక్కు నుంచి ట్యూబ్‌ల ద్వారా ద్రవ పదార్థాలను మాత్రమే తీసుకుంటుంది. కావ్య అనారోగ్యానికి ఇప్పటికే రూ.లక్షల్లో ఖర్చు అయింది. బాలిక తండ్రి హరికుమార్ రైల్వేలో సీనియర్ టెక్నీషియన్ ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేశారు. కుమార్తెను బతికించుకోవాలని సొంత ఇంటిని అమ్ముకున్నారు. కావ్య సోదరుడు ఆర్థిక పరిస్థితులు కారణంగా డిగ్రీ చదువును మధ్యలోనే ఆపేశాడు. స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు స్పందించి శక్తిమేరకు ఆర్థిక సహాయం చేసి కావ్యకు పునర్జన్మ కల్పించాలని కుటుంబీకులు కోరుతున్నారు.

కావ్య పరిస్థితిని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ చూసి చలించిపోయారు. కావ్యకి కావాల్సిన వైద్య సదుపాయం గురించి తెలుసుకొని సహాయానికి తన వంతు ప్రయత్నం చేస్తానని, కావ్య సోదరుడు దీపక్ చదువుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించి కావ్యకు సహాయం అందించాలని పట్టా ఫౌండేషన్ అధ్యక్షులు పట్టా రమేష్ కోరారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషనర్ ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి బాలిక సమస్యను తీసుకెళ్లి తగు సహాయం కోసం కృషిచేస్తామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం చెప్పారు. దాతలెవరైనా ఉండే కావ్య తండ్రి కె.హరికుమార్ ఫోన్ పే, గూగుల్ పే నెంబర్ 091 98483 23144, కెనరా బ్యాంక్ అకౌంట్ 35802010060107, IFSC Code: CNRB0013580కు సహాయం అందించాల్సిందిగా కోరారు.

సమాచారం లేకుండా విద్యుత్ సరఫరా బంద్

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పరిధిలో విద్యుత్ శాఖాధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే సరఫరాను నిలిపేస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరా రలేక వినియోగదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం రహదారిలో హెచ్‌టి వైర్లు మార్చే ప్రక్రియను శనివారం చేపట్టారు. దీనిపై వినియోగదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. స్థానికులు ఎఇకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఎండాకాలం, కరెంటు కోత, ఉక్క పోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. కాలకృత్యాలు తీర్చుకోవటానికి కూడా నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు సమాచారం ఉంటే నీరు ట్యాంకుల్లో నింపుకునేవారమని పలువురు అభిప్రాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి పురుషోత్తపురం జనసేన నాయకులు ఉరిటి లక్కీగోవింద్ ఆధ్వర్యాన చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉరిటి లక్కీగోవింద్ మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ ఆశయ సాధన కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలు చేయడానికి జనసేన రాష్ట్ర కార్యదర్శి శివశంకర్ సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. గత మూడేళ్ల నుంచి కూడా ఈ చలివేంద్రం ఏర్పాటుచేస్తున్నామని పేర్కొన్నారు. బాటసారులకు ఈ చలివేంద్రం దాహార్తి తీరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జనసేన నాయకులు సేనాపతి శేఖర్, వబ్బిన శ్రీకాంత్, పిన్నింటి పార్వతి, తనకాల శ్రీనివాస్, మోటూరి చైతన్య, దార్ల సాయినాథ్, మండా సతీష్, మామిడి రామారావు, దత్తాత్రేయ, మేడిశెట్టి అప్పారావు, పిల్లా నరేష్, బుదిరెడ్డిల రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి -ములగాడ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్కాపురం సిఐ లూథర్‌బాబు సూచించారు. జీవీఎంసీ 60వ వార్డు పరిధి ఇంద్ర కాలనీ-2లో సైబర్ నేరాలపై సిఐ లూథర్‌బాబు అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికమయ్యాయన్నారు. సైబర్ నేరగాలు వివిధ ఫోన్ నెంబర్లుతో ఫోన్లు చేసి ఫలానా స్కీం వచ్చిందని, ఒటిపిలు చెప్పమని ప్రజలన అడిగి మోసగిస్తున్నారని తెలిపారు. ఎవరూ ఒటిపిలు చెప్పవద్దని కోరారు. అలాంటప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు. వేసవి సెలవులకు స్వగ్రామాలకు వెళ్లే వారు మల్కాపురం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి -గోపాలపట్నం : జీవీఎంసీ 89వ వార్డు పరిధి ఎల్లపువానిపాలెంలో జనసేన ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 134 మందికి కంటి పరీక్షలు చేశారు. 31 మందికి నేత్ర శస్త్ర చికిత్సలు జరపాల్సి ఉందని వైద్యులు తెలిపారు. 60 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు జోగా అప్పలరాజు మాట్లాడుతూ, జనసేన ఆధ్వర్యాన ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి పార్టీ బోలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్యులు, జనసేన నాయకులు అవినాష్, గణేష్, సురేష్, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'వాస్తవం' పురస్కారాలు

ప్రజాశక్తి కంచరపాలెం : సమాజంలో మంచిని ప్రభావితం చేసే శక్తి కేవలం ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు మాత్రమే ఉంటుందని శారదా పీఠం ఉత్తరాధిపతి స్వామి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. విశాఖలోని పౌర గ్రంథాలయంలో శనివారం వాస్తవం దినపత్రిక పురస్కారాలను ఆయన అందించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభావంతులను వాస్తవం ప్రతినిధులు స్వామీజీ ద్వారా సత్కరించారు. మీడియా రంగంలో విశేష సేవలు అందించిన సీనియర్ జర్నలిస్ట్ రావులవలస రామచంద్రరావు వాస్తవం పురస్కారం అందించారు. ఈ కార్యక్రమంలో స్టీల్ కార్మిక సంఘం నాయకులు మంత్రి రాజశేఖర్, వాస్తవం దినపత్రిక ఎడిటర్ తిర్లంగి హరి, సీనియర్ జర్నలిస్టులు ఎంఆర్‌ఎన్ వర్మ, ఎన్ఎన్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటపతిరాజు చెరువు మట్టి అక్రమ తరలింపు

అడ్డుకున్న అధికారులు

అక్రమంగా మట్టి తవ్విన వెంకటపతిరాజు చెరువు,

తోటలో దాచి పెట్టిన జెసిబి

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని ఆరిపాక పంచాయితీ పరిధిలోని వెంకటపతిరాజు చెరువులో మట్టిని గ్రామంలో ఇటుక బట్టి నిర్వాహకులు శనివారం ఉదయం అక్రమంగా తరలిస్తుండగా స్థానిక రెవిన్యూ సిబ్బంది, పోలీసులు వెళ్లి అడ్డుకున్నారు. ఆరిపాకకు చెందిన ఇటుకుల బట్టీ నిర్వాహకులు వెంకటపతిరాజు చెరువు నుండి మట్టి తరలించి ఇటుక బట్టి నిర్వహిస్తున్నారు. దీని వెనుక గ్రామానికి చెందిన అధికార ప్రజా ప్రతినిధులు హస్తం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. శనివారం రెండు జెసిబిలు, నాలుగు ట్రాక్టర్‌లతో అక్రమంగా మట్టి తరలించారు. దీంతో గ్రామానికి చెందిన కొంతమంది రెవిన్యూ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మట్టి అక్రమ త్రవ్వకాలు అడ్డుకున్నారు. ఇంతలో మీడియా ఆ ప్రదేశానికి చేరుకోవడంతో ఒక జేసిబి, ట్రాక్టర్లను ఒక మామిడి తోటలోకి మళ్లించారు, ఒక జేసిబి తోట కాలువలోకి తీసుకెళ్లి నిర్వాహకులు దాచి పెట్టారు. ఈ చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్న సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ సిబ్బంది అక్కడికి చేరుకునే లోపే అక్రమ దారులు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ చెరువు నుండి అక్రమంగా మట్టి రవాణా జరగకుండా చూసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఎంపి డాక్టర్ సత్యవతిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఫ్యూచర్ వరల్డ్ ఆధ్వర్యాన సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని శంకరం ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి చేతుల మీదుగా అడ్వెంచర్స్ సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో ధైర్య సాహసాలను పెంపొందించేందుకు ఇటువంటి క్యాంపులు నిర్వహించడం పట్ల పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. స్కూల్ డైరెక్టర్ పార్వతీశం మాట్లాడుతూ అడ్వెంచర్స్ సమ్మర్ క్యాంపులో భాగంగా పెయింట్ బాల్, షూటింగ్, విలువిద్య, జిప్ లైన్, కమాండోనేట్, రాప్లింగ్ వంటి వివిధ కోర్సులు నిర్వహిస్తున్నమని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతిని సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న పాత్రికేయులు

పేపర్ ఏజెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- కె.కోటపాడు : సుదీర్ఘకాలంగా అన్ని దినపత్రికలకు ఏజెంట్‌గా పని చేస్తూ... అనారోగ్యానికి గురై మృతి చెందిన సన్యాసిరావు కుటుంబానికి శనివారం స్థానిక పాత్రికేయులు ఆర్థిక సహాయం అందించారు. గత 25 సంవత్సరాలుగా పాఠకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించిన సన్యాసిరావు మన మధ్య లేకపోవడం విచారకరమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి కుబిరెడ్డి రాధాకృష్ణ అన్నారు. నిరుపేద కుటుంబం అయిన సన్యాసిరావుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని ఏపీయూడబ్ల్యూజే ఫెడరేషన్ జిల్లా నాయకులు ఎలమంచిలి ధర్మారావు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల విలేకర్లు గజ్జి బాలగంగాధర్, శిలపరిశెట్టి వెంకటరావు, దాడి నరసింగరావు, సురభి సతీష్, నేమాల సతీష్, నీలి శ్రీను, బోని సత్యనారాయణ, నంబారు అప్పారావు, కుబిరెడ్డి సన్నిబాబు, శరగడం పరమేష్, కొరుపోలు రామకృష్ణ పాల్గొన్నారు.

ఖాళీ ప్లేట్లతో రుషిల్ డెకార్ కార్మికుల నిరసన

ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న ముఠా కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రుషిల్ డెకార్ ప్లైవుడ్ కంపెనీ ముఠా కార్మికులు శనివారం ఖాళీ ప్లేట్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు. పరిశ్రమ యాజమాన్యం అవలంభిస్తున్న మొండివైఖరికి నిరసనగా గత 18 రోజులుగా ముఠా కార్మికులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. నిరసన కార్యక్రమంలో భాగంగా తమ డిమాండ్లు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆందోళన కార్యక్రమాన్ని కొనసాగించారు. ముఠా కార్మికులందరూ ఖాళీ ప్లేట్లు పట్టుకొని అడుక్కునే పద్ధతిలో నినాదాలు చేశారు. పరిశ్రమ మొండివైఖరి విడనాడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ ఎస్సీజడ్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు మెరుగైన ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఏపీఐఐసీ అధికారులు, పరిశ్రమ యజమానులు, ప్రభుత్వం కుమ్మక్కై ఉన్న ఉపాధిని పోగొట్టే విధంగా కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. ఈ కుయుక్తుల భాగంగా ముఠా కార్మికులకు పనులు కల్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నానాజీ, గొర్ల అప్పలనాయుడు, వరహాల నాయుడు తాతారావు, సూరిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

'ఏం చేసిందో చెప్పలేని స్థితిలో టిడిపి'

ప్రజాశక్తి- దేవరాపల్లి : తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రజలు ఏమి చేశారో చెప్పలేని స్థితిలో ఆ పార్టీ నాయకులు ఉన్నారని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. శనివారం ఆయన తారువలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జాబు రావాలంటే బాబు రావాలని చెప్పి 2014లో గెలిచిన టిడిపి ఎన్ని ఉద్యోగాలిచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ యువతకు రూ.1000 నుంచి రూ.2000 వరకూ నిరుద్యోగ భృతి ఇస్తానని యువతను చంద్రబాబు మోసం చేశాడని, ఇచ్చిన హామీని పక్కన పెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కర్రీ సత్యం, పార్టీ నాయకులు కెవి రమణ, కర్రి సూర్య నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి ఇద్దరు తొలగింపు

ప్రజాశక్తి-చోడవరం : పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు ఇద్దరిని వైసిపి నుండి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చోడవరం మండలం ముద్దుర్తి గ్రామానికి చెందిన అప్పికొండ సోమేశ్వరరావు (లింగ బాబు)ను జంగమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా, బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామానికి చెందిన చిత్రాడ జగదీష్‌ను అఖిలగాండ్ల తెలుకల కార్పొరేషన్ డైరెక్టర్‌గా గతంలో నియమించినట్లు చెప్పారు. ఈ ఇరువురు పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతూ నియోజకవర్గంలో పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుండడంతో కార్యకర్తల అభీష్టం మేరకు వారిని పార్టీ నుండి సస్పెండ్ చేశామని తెలిపారు. కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉంటూ పార్టీకి నష్టం వచ్చే విధంగా వ్యవహరించడంతో డైరెక్టర్ పదవుల నుండి వారిని తొలగించి, పార్టీ నిర్ణయం మేరకు మరో ఇద్దరికి అవకాశం ఇచ్చామని చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ నిర్ణయాన్ని దిక్కరించి వారు కోర్టుకు వెళ్లడంతో సస్పెండ్ అనివార్యమైందన్నారు.

మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కరణం ధర్మశ్రీ

వడదెబ్బకు మృతి చెందిన ఉపాధి కూలీలకు

రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

కూలీలతో కలిసి పని చేస్తున్న వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

జిల్లాలోని వడదెబ్బకు మృతి చెందిన ఉపాధి హామీ కూలీలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి వెంకన్న డిమాండ్ చేశారు. ఎండలు తీవ్రంగా ఉండడం వలన రెండు రోజులు క్రితం బుచ్చయ్యపేట మండలంలో పని ప్రదేశంలోనే ఉపాధి కూలీ మృతి చెందగా, వి.మాడుగుల మండలం ఎం కోటపాడు గ్రామంలో దట్టి నూకరాజు పని ప్రదేశం వద్ద వడదెబ్బకు చని పోవడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రతి పని ప్రదేశంలోని వెంటనే టెంట్‌లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ఏడాదికి 200 రోజుల పని దినాలు, రోజు కూలి రూ.600 కల్పించాలని డిమాండ్ చేశారు. శనివారం దేవరాపల్లిలో ఉపాధి కూలీలు పనులు చేస్తున్న ప్రాంతంలో పర్యాటించి కూలీలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై భారాలు ఎక్కువయ్యాయని తెలిపారు. సమస్యలు పరిష్కారం కావాలంటే పేదలంతా ఐక్యమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- సబ్బవరం : మండల కేంద్రంలోని సీబీఎం చర్చి ఆవరణలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖపట్నం కల్వరి బాప్టిస్టు చర్చి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇరువాడ కల్వరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సౌజన్యంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత ఆరోగ్య సేవలు అందించడంలో సీబీఎం చర్చ్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చర్చ్ పాస్టర్ యు.చర్చిల్, వైసీపీ రాష్ట్ర యువజన నేత జోబ్ దాస్, మానలతరాజు, వైసీపీ నేతలు బోకం రాము నాయుడు, కోటాన రాము, సబ్బవరపు నారాయణ మూర్తి, కర్రి బాబు, బలిరెడ్డి కనకరాజు,బుదిరెడ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని గాలి భీమవరం పంచాయతీ శివారు పల్లవానిపాలెం గ్రామంలో పల్లవానిపాలెం నుంచి సున్నం బట్టిలు కనెక్టింగ్ బిటి రోడ్డు నిర్మాణానికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 లక్షలతో ఈ బిటి రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని మారుమూల గ్రామాలకు పక్కా రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్య కుమారి రామునాయుడు, వైసిపి నాయకులు కోటాన రాము, సబ్బవరపు నారాయణమూర్తి, కర్రి బాబు, స్థానిక సర్పంచ్ గొర్లి రాజేష్, వనం అచ్చం నాయుడు, కాపుసెట్టి శేషు బాబు, బోను నాయుడు, బలిరెడ్డి కనకరాజు, బుదిరెడ్ల రామకృష్ణ, బైలపూడి రామారావు, పల్ల కృష్ణ, కర్రి శ్రీను, బంతికోళ్ల పద్మ, విరోతి రామారావు, ఎడ్ల నాయుడు, జెట్టి హేమంత్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

బోరు ఏర్పాటుకు పూజ చేస్తున్న జెడ్‌పిటిసి దొండా రాంబాబు

బోరు బావుల ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని తైపురం బీసీ కాలనీలో జడ్పిటిసి నిధులతో మంచినీటి బోరు ఏర్పాటు పనులకు శనివారం జడ్పిటిసి సభ్యులు దొండ రాంబాబు పూజ నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య లేకుండా తన నిధుల నుండి మంచినీటి బోర్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తైపురం గ్రామ సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను, మండల సచివాలయ కన్వీనర్ కోరుకొండ అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ దేగల అప్పారావు మాజీ జెడ్పిటిసి బుదిరెడ్డి అప్పారావు, ఎక్స్ కోపరేటివ్ ప్రెసిడెంట్ ప్రకాష్ పంతులు, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపి సెట్టి శీను, కరక సర్పంచ్ యన్నం శెట్టి సత్యారావు, కరక మాజీ సర్పంచ్ బి.రామ కృష్ణ, నాయుడు, చిట్టియ్య పాలెం సర్పంచ్ అబ్బాస్, నీల కంట పురం సర్పంచ్ పడాల నాగ భూషణం చిన్నప్పన్నపాలెం సర్పంచ్ కోయిల ఈశ్వరరావు పాల్గొన్నారు.

అనకాపల్లి : తుమ్మపాల సచివాలయం-3 పరిధిలో ఉన్న తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో బోరుబావి ఏర్పాటుకు శనివారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ భూమి పూజ చేశారు. సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి శేఖర్, ఉప సర్పంచ్ చదరం చిన్న, ఎంపీటీసీ సభ్యులు వడ్డాది భారతి అశోక్, సచివాలయం 2 కన్వీనర్ బుద్ద లహరి, పెంటకోట రాజు, పాల్గొన్నారు.

పాలీసెట్‌కు శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని నాగులపల్లిలోని చంద్రశేఖర మహాస్వామి పిరమిడ్ ధ్యాన కేంద్రంలో 10వ తరగతి విద్యార్థులకు పాలిసెట్ శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ శిక్షణా తరగతులను విశ్రాంతి ఎంఈఓ సూర్యారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమలో ఉన్న విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కోచ్ ఈశ్వరరావు మాట్లాడుతూ ధ్యాన గురువు సుజాత ఆదేశాలతో ఈ బాధ్యతను స్వీకరించానని తెలిపారు. ఈ శిక్షణకు వచ్చే వారందరికీ తప్పనిసరిగా ర్యాంకు వచ్చే విధంగా తాను కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రంశెట్టి అనిల్, శివ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామాలు కొప్పాక, శిరసపల్లి, కేఎన్ఆర్‌పేటలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలపై ప్రజలను ఆరా తీశారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి సమస్యలను మంత్రి దృష్టికి స్థానికులు తెచ్చారు. తక్షణమే వీటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలకు అనుకూలంగా నడుస్తున్న ఈ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో పెద్ద మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఎంపిపి గొర్లి సూరిబాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా లబ్దిదారులకు పథకాలు అందించడంలో వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు పేర్కొన్నారు. ఆయన శనివారం మున్సిపాలిటీలోని 16వ వార్డులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమురితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పథక లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం అందిస్తున్న పథకాల వివరాలు రాతపూర్వకంగా అందించి వివరించారు. వార్డు వాలంటీర్లకు సొంతనిధులతో సమకూర్చిన బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ సుకుమార్‌వర్మ, కమిషనర్ కృష్ణవేణి, 16వ వార్డు కౌన్సిలర్ కిరణ్, ఎంపిపి బోదెపు గోవిందరావు, వైస్ ఛైర్మన్లు బెజవాడ, గుప్తా, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎర్రయ్యదొర, బ్యాంకు అధ్యక్షులు మళ్ల కొండబాబు, కొల్లి త్రినాథ్, సేనాపతి రాము, దాసరి కుమార్, కోడిగుడ్డు రమణ, కొఠారు కొండబాబు, మున్సిపల్ డిఇ వీరయ్య, టిపిఒ శ్రీలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

అంతర్జాతీయ కార్మిక దినం 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో మే 1న జరగనున్న మేడేను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రామునాయుడు కార్మిక కర్షక నిలయంలో శనివారం సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకర్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎందరో కార్మిక నాయకుల పోరాట ఫలితంగా అనేక హక్కులు సాధించుకున్నామన్నారు. నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక కోడ్లు అమలు చేయడం ద్వారా వారి హక్కులను హరించివేస్తే అవుతుందని తెలిపారు. రైతాంగం గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయ కూలీలుగా వలస కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయలేదన్నారు. జిల్లాలో ఫార్మసీ, అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో కార్మికులకు భద్రత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మిక హక్కులను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. బిజెపి మతోన్మాద అజెండాను అమలు చేసి ప్రజల్లో చీలిక తెస్తోందని, నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని తెలిపారు. కార్మికులు కర్షకులు తమ హక్కుల సాధన కోసం మేడే స్ఫూర్తిగా చేసుకుని మరిన్ని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము, గూనూరు వరలక్ష్మి, చంద్రశేఖర్, జి దేవుడు నాయుడు, అడిగర్ల రాజు, డి సత్తిబాబు, 24 మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభం

ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న వైవి. సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- పరవాడ

మండలంలోని గొర్లివానిపాలెం పంచాయతీ పరవాడ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీని ఆనుకొని సుమారు 2 కోట్లతో నిర్మించిన ఇండోర్ స్టేడియంను శుక్రవారం రాత్రి టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు శాఖ మంత్రి గుడివాడ అమర్నాధ్ ప్రారంభించారు. ముందుగా వీరికి దేశపాత్రునిపాలెం వద్ద పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పరవాడ ఎంపిపి పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జడ్పీటీసీ పైల సన్యాసిరాజు శాలువా కప్పి, గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన 1000 బైక్ల ర్యాలీలో పాల్గొని స్టేడియం వద్దకు చేరుకున్నారు. అక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం ఈ.బోనంగి పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్నాధ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతమ్మ పాల్గొని ఇంటింటికి వెళ్లి, గత ప్రభుత్వ వైఫల్యాలు , తమ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వైసిపి నాయకులు కోన రామరావు, వెన్నెల సన్యాసిరావు, సర్పంచ్ గొర్లి గోపి అమ్ములు, ఎంపీటీసీ గొర్లి వరలక్ష్మి ఎరుకు నాయుడు పాల్గొన్నారు.

చంద్రబాబుపై రాళ్లదాడి పోలీసుల వైఫల్యమే

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో రాళ్ల దాడి చేయడం పోలీసుల వైఫల్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జెడ్ ప్లస్ సెక్యూరిటీ ఉన్న చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి రౌడీ మూకలు రాళ్లదాడి చేస్తుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. స్వయానా మంత్రి ఆదిమూలపు సురేష్ నడిరోడ్డుపై చొక్కా విప్పుకొని రాష్ట్ర మంత్రిననే విషయం మరచి తన స్థాయి విడిచే వ్యవహరించడం నీతిమాలిన చర్యగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర హోం శాఖ మంత్రి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సబ్బవరపు గణేష్, ఎంపీటీసీ సభ్యులు తోటాడ విజయ్ పాల్గొన్నారు.

కె.కోటపాడు : వైసిపి ప్రభుత్వం కావాలనే చంద్రబాబుపై రాళ్ల దాడి చేయించి, సిగ్గులేకుండా చంద్రబాబు, లోకేష్ దళితుల్ని అవమానించారని విషప్రచారం చేస్తున్నారని టిడిపి మాడుగుల నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అంబేద్కర్ రాజ్యాంగం జగన్ ప్రభుత్వంలో ప్రతి రోజూ అవహేళనకు గురవుతోందన్నారు. పల్లెల్లో వైసిపి ప్రభుత్వానికి, నాయకులకు ఎదురవుతున్న అవమానాలతో దిక్కుతోచక యర్రగొండపాలెంలో చంద్రబాబును అడ్డుకొనేందుకు పథక రచన చేశారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వం ఆడమన్నట్లు ఆడుతున్న పోలీసులు తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు రోడ్‌షోపై రాళ్లు విసరడం సిగ్గు చేటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పుచ్చా విజయ్ కుమార్ అన్నారు. శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితులకు న్యాయం చేయలేని మంత్రి ఆదిమూలపు సురేష్ ఆధ్వర్యంలో వైసిపి కార్యకర్తలు దాడికి పాల్పడ్డారన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమన్నారు.

ఈదురు గాలులతో వర్షం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలో శనివారం ఈదురు గాలులతో వర్షం కురిసింది. దీంతో గత పది రోజులుగా ఎండవేడిమికి ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు ఒక్కసారిగా ఉపశమనం కలిగింది. వేలాపాలలేని విద్యుత్ కోతలు, ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈదురు గాలులకు మామిడి జీడి తోటలకు కొంత నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెప్పారు. ఈ వర్షం మెట్ట ప్రాంతాల్లో సాగు చేస్తున్న పంటలకు కొంత ఊరట కలుగుతుందని రైతులు తెలిపారు.

వడ్డాది : రెండు వారాలుగా వడగాలులు, ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజానీకానికి ఊరట లభించింది. శనివారం సాయంత్రం వడ్డాది పరిసర గ్రామాలలో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు భానుడు ప్రతాపం చూపించగా తరవాత ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. నాలుగు గంటల నుండి గాలివాన ప్రారంభమైంది. ఉరుములు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

వ్యవసాయ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- కె.కోటపాడు : రైతులకు పలు సూచనలు, సలహాలు అందించడమే కాకుండా పనిలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకున్న నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులను వ్యవసాయ శాస్త్రవేత్తలు శనివారం అభినందించారు. వ్యవసాయ కోర్సు ఆఖరి సంవత్సరంలో మూడు నెలల పాటు క్షేత్రస్థాయిలో పనితనాన్ని మెరుగుపరుచుకునేందుకు వ్యవసాయ విద్యార్థులు పుష్ప, మంజరి, ఉమా, స్నేహలత, తేజేస్వరి మండలంలోని సింగన్న దొరపాలెం వచ్చిన విషయం విధితమే. ఈ విద్యార్థులు రైతులతో ముఖాముఖి చర్చలు జరిపారు. విద్యార్థులకు తెలియని విషయాలను రైతుల ద్వారా తెలుసుకోవడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. విద్యార్థులు చేస్తున్న పని నైపుణ్యాలను ఎప్పటికప్పుడు విశ్వవిద్యాలయ అధికారులు పర్యవేక్షించారు. ఇందులో భాగంగా కార్యక్రమ వివరాలను విశ్వవిద్యాలయ అసోసియేట్ డీన్ డి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి స్పందన పరిశీలించారు. విద్యార్థులకు కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజకుమార్, కిషోర్ కుమార్ ఎప్పటికప్పుడు పలు సూచనలు అందజేశారు.

రాహుల్ గాంధీకి సంఘీభావం తెలపాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయవాడలో ఈనెల 24న జరగనున్న జైభారత్ సత్యాగ్రహ దీక్షలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీకి సంఘీభావం ప్రకటించాలని పిసిసి సభ్యులు మీసాల సుబ్బన్న, పిఎస్ దత్తు పిలుపునిచ్చారు. స్థానిక న్యూ కాలనీలో పిఎస్ దత్తు స్వగృహంలో శనివారం జై భారత్ సత్యాగ్రహ దీక్ష సన్నాహక సమావేశం బోయిన భానుమూర్తి యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు మలపురెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని త్వరలోనే పునఃప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ సభ్యులు విన్నకోట రాము, ఆర్‌ఆర్ నాయుడు, పడాల కొండలరావు, కళ్ళ సత్యనారాయణ, పార్టీ నాయకులు కత్తెర శ్రీధర్, సత్యనారాయణ, సేనాపతి రాజు, కె.వి మాణిక్యం, మాడిప్ప నాయుడు, సూరిశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రశాంతి నికేతన్ స్కూల్ కరస్పాండెంట్ డివి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ప్రారంభించారు. పూడిమడక రోడ్లో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ద్విచక్ర వాహనదారులకు, పాదచారులకు, కార్మికులకు ఉపశమనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అగనంపూడి ప్రశాంతి నికేతన్ స్కూల్ కరస్పాండెంట్ డి చంద్రశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్, పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రతో టిడిపికి అధికారం ఖాయం

ప్రజాశక్తి- కశింకోట : టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రతో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని సుందరయ్యపేట గ్రామంలో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లోకేష్ పాదయాత్ర 1000 కిలో మీటర్లు చేసినా సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రన్న రంజాన్ కానుకలను పున ప్రారంభిస్తామని చెప్పారు. టిడిపి నాయకులు కాయల మురళి, ఉగ్గిన రమణ మూర్తి, కూండ్రపు రాము నాయుడు, రెడ్డి సూరిబాబు, సత్య మూర్తి, కూండ్రపు అక్కు నాయుడు, వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, నైనంశెట్టి రమణారావు, ఉల్లింగల రమేష్, కలగా సోమేశ్వర రావు, ఎర్రి నాయుడు, అయ్యాల నాయుడు, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి - కోటవురట్ల: విద్యుతాఘాతంతో మృతి చెందిన రెడ్డి కరయ్య కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ సురేష్ బాబు, ఏడి అనిల్ కుమార్ బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. స్థానిక ఎస్ఐ నారాయణరావు, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు పైల రమేష్, విద్యుత్ శాఖ సిబ్బందితో జరిగిన చర్చల అనంతరం విద్యుత్ శాఖ అధికారులు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా అందే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. విద్యుత్ ఘాతం జరిగిన ప్రదేశంతో పాటు బలహీనంగా ఉన్న విద్యుత్తు లైను మరమ్మత్తులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా ఎస్ఎస్ఎ వార్షికోత్సవం

డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలో పాములవాక గ్రామంలో ఎస్ఎస్ఏ స్కూల్, కాలేజీ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాసంస్థల ఛైర్మన్ ఇటంశెట్టి సాయికుమార్, పద్మావతి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మాతృ వందనం పేరుతో తల్లిదండ్రులకు విద్యార్థుల చేత చేయించిన పూజా వందనం పలువురిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నర్సీపట్నం కంటి వైద్య నిపుణులు డాక్టర్ మద్దు రమణ, డాక్టర్ ఇందిరా దేవి దంపతులు చిన్నారులను ఆశీర్వదించి క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. లక్ష్యం నిర్దేశించు కుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. విద్యార్థుల నడవడికను ఉపాధ్యాయులు పరిశీలించి ఉన్నత విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. కోటవుట్ల మండలం వైసిపి మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, టిడిపి మండల నాయకులు వేచలపు జనార్దన్ మాట్లాడుతూ,ఉన్నత విలువలతో విద్యను అందించడంతోపాటు విద్యార్థులను తల్లిదండ్రులను ప్రోత్సహిస్తూ వందమందికి ఉచిత హాస్టల్ వసతి సౌకర్యం కల్పించడం ఆనందదాయకం అన్నారు. అనంతరం సీరం రెడ్డి చిన సత్యం సావిత్రి దంపతులను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నేత వరహాలు

ఎండల్లో కూలీలు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి -రావికమతం: ఎండలకు ఉపాధి కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు తెలిపారు. మండలంలో కవగుంట గ్రామంలో శనివారం ఉపాధి కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉదయాన్నే తొందరగా ఉపాధి పనులను ప్రారంభించుకొని ఎండలకు ముందుగా పూర్తిచేసుకోవాలన్నారు. రోజు వారి వేతన కూలి రూ.272కు తగిన పనిని ప్రణాళిక ప్రకారం గ్రూపు సభ్యులు పూర్తి చేసుకోవాలన్నారు. మంచినీటి బాటిల్స్ అందరూ తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు. మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు సౌకర్యాలను కల్పించాలని పలువురు ఉపాధి కూలీలు సర్పంచి దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన సర్పంచ్ ఉన్నత స్థాయి అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేత వరహాలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై ఆరా

ప్రజాశక్తి-కోటవురట్ల: మండల కేంద్రంలో శనివారం స్థానిక సర్పంచ్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనిల్ కుమార్ జగనన్న నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, గృహ సారథులు, గ్రామ వాలంటీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న నేతలు

పిడుగుపడి పాడి గేదె మృతి

ప్రజాశక్తి-మాడుగుల: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో పాటు పిడుగు పడటంతో పాడి గేదె మరణించింది మాడుగుల అర్బన్ కాలనీ సమీపంలో తూరిబిల్లి కల్లాల వద్ద యాల్ల కొండమ్మకు చెందిన సూలు తో వున్న పాడి గేదె పిడుగు పడడంతో మరణించింది. పాలు సేకరించి జీవనోపాధి పొందుతున్న సదరు కుటుంబం ఈ సంఘటనతో ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించారు.

పక్కా ప్రణాళికతో.. రంగురాళ్ల తవ్వకాలు

- అంతా అందుబాటులో లేకపోవడంపై అనుమానాలు
- వ్యాపారులతో పాటు స్థానిక నాయకుల ప్రమేయం ?
- క్వారీని పరిశీలించిన అధికారులు

రంగురాళ్ల క్వారీ ప్రదేశం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో సాలిక మల్లవరం సమీపంలో ఉన్న అటవీ భూములో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు జరిగాయి. ఈ ప్రాంతంలో మళ్లీ రంగురాళ్ల తవ్వకాలు కలకలం సష్టిస్తోంది. నాలుగు సంవత్సరాల క్రితం ఇక్కడ అక్రమంగా తవ్వకాలు జరగడంతో అటవీశాఖ ఏకంగా ఇక్కడ బేస్ క్యాంపే ఏర్పాటు చేశారు. నిఘా పేరిట ఇద్దరు సిబ్బంది నిత్యం రాత్రి వేళల్లో పహారా కాసేవారు . తవ్వకాలు ప్రత్యేక ప్రణాళికతో జరిగినట్లుగా ఇక్కడ పరిస్థితులు కనబడుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలు జరిగిన సమయంలో ఎవరు అందుబాటులో లేకపోవడం విచిత్రంగా ఉంది. బేస్ క్యాంపులో ఉండాల్సిన సిబ్బంది లేకపోవడం, సంబంధిత అటవీ శాఖ గార్డు ముందు రోజు వరకు విధుల్లో ఉండి శుక్రవారం రాత్రి తిరుపతి వెళ్లి పోవడం, అటవీ శాఖ రేంజర్ లక్ష్మీనరసింం మూడు రోజులుగా సెలవులో వెళ్ళిపోవడం, స్థానిక పోలీస్ స్టేషన్లో అందుబాటులో ఉండాల్సిన ఎస్ఐ నర్సీపట్నంకు డ్యూటీ పై వెళ్లడం తాజాగా జరిగిన తవ్వకాలు పలు అనుమానాలకు తావిస్తుంది. ఇక్కడి అటవీ శాఖ గస్తీ పరిధిలో ఉన్న సారికిమల్లవరం క్వారీలో శుక్రవారం రాత్రి భారీ యంత్రాలతో రంగురాళ్ల తవ్వకాలు చేపట్టిన ఘటన సంచలనం సష్టించింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో నాతవరం మండలం నుంచి రెండు టిప్పర్లు, ఒక జెసిబి క్వారీ ప్రాంతానికి చేరుకొని తెల్లవారుజామున మూడు గంటల వరకు తవ్వకాలు జరిగినట్లుగా స్థానిక జాలర్లు కొంతమంది తెలిపారు. మూడు గంటల ప్రాంతంలో కోట్లాది రూపాయల విలువైన రంగురాళ్ల మట్టిని వాహనాల్లో తరలించుకు పోయారు. ఈ తవ్వకాల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన స్థానిక రంగురాళ్ల వ్యాపారి అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు కొంతమంది మీడియా ప్రతినిధులతో కలిసి పక్కా ప్రణాళిక వేసుకొని ఈ తవ్వకాలను చేపట్టినట్లుగా ఈ ప్రాంతీయంతా చర్చించుకుంటున్నారు. వాస్తవానికి గొలుగొండ మండలం సారిక మల్లవరం సమీపంలో అటవీ శాఖ పరిధిలోని రంగురాళ్ల క్వారీల్లోనే గతంలోనూ రంగురాళ్ల తవ్వకాలు జరిగాయి. అప్పటి నుంచి అటవీశాఖ అధికారులు ఈ క్వారీ సమీపంలో ఓ బేస్ క్యాంప్ ఏర్పాటు చేసింది. గత ఏడాది కూడా ఈ క్వారికి సమీపంలో భారీ యంత్రాలతో ఇక్కడ తవ్వకాలు చేపట్టారు. అధికారులు స్పందించి ఖైపిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో కొంత మట్టిని సేకరించారు. తాజాగా అదే క్వారీలో శుక్రవారం రాత్రి జేసీబీ, లారీల్ని ఉపయోగించి తవ్వకాలు చేపట్టి, విలువైన ఆ మట్టిని లారీల్లో తాండవ రిజర్వాయర్కు అనుకుని ఉన్న రోడ్డు ద్వారా గొలుగొండ మండలాన్ని దాటించి ఇతర ప్రాంతాలకు తరలించుకుపోయారు. అందుకోసం శుక్రవారం మధ్యాహ్నమే కొన్ని వాహనాల్ని ఈ ప్రాంతానికి తరలించి, తెల్లార్లూ గుట్టు చప్పుడు కాకుండా తవ్వకాలు సాగించినట్లుగా తెలుస్తోంది. అటవీ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్న క్వారీలోనే తవ్వకాలు చేపట్టడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పథకం ప్రకారమే తవ్వకాలు :

ఒక పథకం ప్రకారమే ఇక్కడ తవ్వకాలు జరిపినట్టు అనుమానాలు తలెత్తుతున్నాయి. ఏళ్ల తరబడి ఇక్కడ అధికారుల నిఘా ఉన్నా ఇదే ప్రాంతంలో రాత్రి వేళ తవ్వకాలు జరపడంపై స్థానికంగా చర్చించుకుంటున్నారు. సదరు క్వారీ వద్ద అటవీశాఖ సిబ్బంది నిత్యం కాపలా ఉంటారు. రాత్రి వేళల్లో ఉన్నతాధికారులు. ఆకస్మిక తనిఖీలకూ వస్తుంటారు. ఇలా ఎలా జరిగిందంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ తవ్వకాల వెనుక కచ్చితంగా అధికారులు ప్రమేయం ఉంటుందనే చెబుతున్నారు. వాస్తవానికి శుక్రవారం రాత్రి గస్తీ సిబ్బంది హాజరు కాలేదు. ఈ ప్రాంత అటవీ శాఖ గార్డ్ ఇందిరా దేవి శుక్రవారం సాయంత్రం వరకు విధుల్లో ఉండి అదే రోజు రాత్రి సెలవు పై తిరుపతి వెళ్లారు. అటవీ రేంజ్ అధికారి కూడా మూడ్రోజులుగా సెలవులో ఉన్నారని ఆ శాఖ సిబ్బందే చెబుతున్నారు. దీంతో ఆయా అనుమానాలు నిజమేనని తెలుస్తోంది. అంతేకాకుండా ఈ ప్రాంతంలో తవ్వకాలేమైనా జరిగితే స్థానికులు పోలీసులు దష్టికి తీసుకువెళ ంటారు. శుక్రవారం రాత్రి తవ్వకాలు జరిగిన సమయానికి గొలుగొండ ఎస్ఐ కూడా స్టేషన్లో లేరని, నర్సీపట్నంలో రాత్రి గస్తీకి వెళ్లినట్టు చెబుతున్నారు. ఇలా అధికారులెవరూ లేని సమయంలో భారీ యంత్రాలతో తవ్వకాలు జరగడం పట్ల పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఎంతమంది అధికారులు ఆ సమయంలో విధుల్లో లేకుండా ఉండడం వెనుక అధికార పార్టీకి చెందిన నేతలు ఒత్తిడే కారణంగా కనిపిస్తుంది. పక్కా వ్యూహం ప్రకారమే తవ్వకాలకు వెళ్లినట్టు తెలుస్తోంది. స్థానిక రంగురాళ్ళ వ్యాపారులతో పాటు కొంతమంది రాజకీయ నాయకులు, విలేకరుల ప్రమేయంతోనే ఈ తవ్వకాలు జరిగినట్టు పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

పరిశీలిస్తున్న పోలీసులు

గస్తీకి ఏర్పాటు చేసిన పాక

తవ్వకాలు చేపట్టింది ఎవరు?

సారిక మల్లవరం రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు చేపట్టినది స్థానిక వ్యాపారులే అధికార పార్టీకి చెందిన నాయకులు అండదండలతో తవ్వకాలు చేపట్టినట్లు ఈ ప్రాంతీయులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. తవ్వకాలు జరిగిన విధానాన్ని చూస్తే ఈ చర్చలకు మరింత ఊతమిస్తున్నాయి. తవ్వకందారులు క్వారీ ప్రాంతాన్ని అంతా విడిచిపెట్టి గతంలో రంగు రాళ్లు దొరికే ప్రదేశంగా గుర్తించిన ప్రాంతంలోనే యంత్రాలతో తవ్వకాలు చేశారు. రంగురాళ్ల క్వారీపై పూర్తి అవగాహన ఉన్న స్థానిక వ్యాపారులకు మాత్రమే ఆ ప్రదేశం తెలుసునని అందుకే తవ్వకాలు చేసింది ఈ ప్రాంతీయులేనని ఈ ప్రాంతీయులు ఆరోపిస్తున్నారు.

క్వారీని పరిశీలించిన అధికారులు:

తవ్వకాలు జరిగిన విషయాన్ని తెలుసుకున్న అటవీ శాఖ డిఎఫ్ఓ రాజారావు శనివారం ఉదయాన్నే రంగురాళ్ల క్వారీ ప్రాంతాన్ని పరిశీలించారు. తవ్వకాలపై విచారణ జరిపి బాధ్యులను కనిపెట్టి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయనతో పాటుగా నర్సీపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణయ్య, గొలుగొండ ఎస్సై నారాయణరావులు పరిశీలించారు.

బిజెపి విధానాలపై పోరాటం చేయాలి

నర్సీపట్నంలో ప్రచారం చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డు కోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.సత్తిబాబు పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం కార్మికులకు, ఉపాధి కూలీలకు, రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్మికులతో శనివారం సమావేశమైన సత్తిబాబు మాట్లాడుతూ, కార్మికులకి ఉద్యోగ భద్రత కల్పించి, రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించాలని పేర్కొన్నారు. ఈనెల 28న నర్సీపట్నంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. నర్సీపట్నంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రాంబిల్లి :మండలంలోని కొత్తపట్నం, అప్పారాయుడుపాలెం గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జి

ప్రచార భేరిలో సిపిఎం, సిపిఐ నేతలు

దేమునాయుడు మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రజా, కార్మిక, వ్యతిరేక, మతోన్మాద విధానాలపై పోరాటం చేయాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, గ్యాస్, పెట్రోల్ డీజిల్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు ఎన్.నారాయణ రావు, దోని అప్పలరాజు, సిహెచ్ నూకరాజు, సిహెచ్ నూకన్న, సిహెచ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న మోడీ విధానాలను ఖండించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్ బ్రహ్మాజీ పిలుపునిచ్చారు. ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం మునగపాకలో తిమ్మడు కాలువ వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులు

సబ్బవరంలో ప్రచారం చేస్తున్న నేతలు

రాంబిల్లిలో సిపిఎం నేతల ప్రచారం

చేస్తున్న కార్మికులను కలిశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెంటకోట శ్రీను, దొడ్డి సంజీవి, పోలిపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

సబ్బవరం : బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి ప్రభావతి కోరారు. మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. పెంచిన పెట్రోల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఉప్పాడ సత్యవతి, లావేటి ఎర్రయ్య, పిల్లి లక్ష్మీ, పిల్లి దేముడమ్మ పాల్గొన్నారు.

గెలిస్తే అమరావతి పూర్తిచేస్తా

- కెఎ.పాల్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: తాను సీఎం అయితే అమరావతిని పూర్తి చేస్తానని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు.

మాట్లాడుతున్న కెఎ పాల్

నర్సీపట్నంలో తన తండ్రిని చూసేందుకు శనివారం వచ్చిన ఆయన తిరుగు ప్రయాణంలో విలేకరులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని పార్టీలు కలిసి వస్తే స్టీల్ ప్లాంట్ ను కొందామని, స్టీల్ ప్లాంట్ కొనే స్తోమత నా ఒక్కడికే ఉందని అన్నారు. చంద్రబాబు, జగన్ లు పరిపాలనలో ఫెయిలయ్యారని హెద్దేవా చేశారు. తనను సీఎం చేస్తే అమరావతి పూర్తి చేసి రైతులకు బహుమతి ఇస్తానన్నారు. సింగరేణిని కాపాడుకోలేని కెసిఆర్ స్టీల్ ప్లాంట్‌ను ఎలా కొనగలడని ప్రశ్నించారు.

సచివాలయ ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో ఏఎల్ పురం సచివాలయంలో కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజేష్ శనివారం కొత్త మల్లంపేట వద్ద ప్రమాదంలో గాయాలయ్యాయి. కేడీపేట నుండి తన స్వగ్రామమైన డౌనూరు వెళుతుండగా కొత్త మల్లంపేట వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాద సమయంలో హెల్మెట్ ఉండడంతో భారీ ప్రమాదం తప్పింది. గాయాల పాలైన ఆయనను ఏ ఎల్ పురం సర్పంచ్ భర్త రమేష్ గోల్కొండ పిహెచ్సికి తీసుకువెళ్లి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నంకు అంబులెన్స్ లో తరలించారు.

మాట్లాడుతున్న బ్యాంక్ అధికారులు

ఎస్‌బిఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక కళ్యాణ మండపంలో స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఖాతాదారుల కనెక్ట్ సదస్సును ఏర్పాటు చేశారు. భారతీయ స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నర్సీపట్నం ఆధ్వర్యంలో ఎస్ఎంఈ కనెక్ట్ ఖాతాదారుల సదస్సును బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఎంఏ స్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏజీఎం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ స్వరూప్ మాట్లాడుతూ, ఖాతాదారులకు ఎస్ఎంఈ ద్వారా సేవల అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బ్యాంకు ద్వారా ముద్ర లోన్లు కొత్తగా వ్యాపారాలు పెట్టే వారికి, కొత్తగా పెట్రోల్ బంకులు పెట్టే వారికి ఎటువంటి షూరిటీలు లేకుండా లోన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. డిజిటల్ పేమెంట్స్ బ్యాంకు అందించే స్కీములపై వివరించారు. ఖాతాదారులకు మరెన్నో సేవలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-మాడుగుల:మండల కేంద్రానికి చెందిన న్యాయవాది శ్రీనాధు ప్రసాదరావు తన పెళ్లి రోజు సందర్భంగా పేదలకు శనివారం వస్త్రాలు పంపిణీ చేశారు. ముందుగా స్థానిక సెయింట్ ఆన్స్ వృద్ధాశ్రమంలో దుప్పట్లు, నైటీలు పంపిణీ చేశారు. బస్ స్టాండ్ వద్ద ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అప్పలరాజు పురంలోని లలిత వృద్ధాశ్రమంలోని వద్దులకు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

పంపిణీ చేస్తున్న ప్రసాదరావు

నేతలు, అధికారులపై చర్యలు తీసుకోవాలి

గొలుగొండ: మండలంలో సాలికమల్లవరం రంగురాళ్ల క్వారిలో అక్రమ తవ్వకాలకు అధికార పార్టీ నాయకులు, అటవీ అధికారులే కారణమని జనసేన నర్సీపట్నం నియోజకవర్గం ఇంచార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక శాసనసభ్యులు, అధికార పార్టీ నాయకులు, అటవీశాఖ అధికారులు పోలీసు అధికారులు కుమ్మక్కవడంతోనే తవ్వకాలు జరిగాయన్నారు. జెసిపిని అటవీ శాఖ అధికారులు, పోలీసులు ఇప్పటివరకు ఎందుకు కనుక్కోలేక పోయారో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రోజు పహారా కాయాల్సిన అటవీ శాఖ సిబ్బంది శుక్రవారం క్వారి ప్రాంతానికి ఎందుకు రాలేదో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల పార్టీ అధ్యక్షుడు గెడ్డం దొరబాబు , మండలం సీనియర్ నాయకులు రేగుబళ్ళ శివ, వాసు, వెంకటేష్, చిరంజీవి, కొప్పాక కళ్యాణ్, పత్తి సూరిబాబు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

అనకాపల్లిలో వేడుకల్లో పాల్గొన్న మంత్రి అమర్‌నాథ్

రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి, విశాఖ జిల్లాలోని మసీదుల్లో ముస్లిములు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

ప్రజాశక్తి- ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి:ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను శనివారం అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శారద నగర్ ఈద్గా దర్గా వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్నాథ్, పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరిన మేరకు మంత్రి అమర్నాథ్ తక్షణమే మంజూరు చేశారు. వచ్చే రంజాన్ నాటికి పూర్తిస్థాయిలో కాంపౌండ్ వాల్ నిర్మిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

పరవాడ : మండలంలోని పరవాడ, చీపురుపల్లి, రావాడ పంచాయతీ శివారు గొల్లగుంట గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ముస్లింలు ఒకరు, కోకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకునున్నారు. గోల్లగుంటలోని వేడుకల్లో టిడిపి మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా సరోజిని దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ యాసిన్, షేక్ బషీర్, షేక్ ఖలీల్, షేక్ మదీనా, షేక్ అలీ పాల్గొన్నారు.

కశింకోట : మండలం చింతలపాలెం గ్రామంలో సయ్యద్ జాఫర్ షా మసీద్‌లో జాఫర్ షా రంజాన్ పండుగ శనివారం జరిగింది. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షేక్ బాబ్జి, షేక్ రహిమాన్, షేక్ ఇస్మైల్, షేక్ మహమ్మద్. రబ్బానీ, షేక్ అబ్దుల్ రహిమాన్ పాల్గొన్నారు. కశింకోటలో జరిగిన కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సెల్ నాయకులు యస్ కే రెహమాన్ (బాబర్) పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల కేంద్రంలో మక్కా మసీద్, మజీద్ ఉస్మాన్ ఘనీ వద్ద ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మసీదుల్లో మత పెద్దలు మాట్లాడుతూ చెడుకు దూరంగా ఉంటూ మంచి కోసం తపించే మాసమే రంజాన్ మాసమని అన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు.

నక్కపల్లి:మండలంలోని ముస్లిం గ్రామాల్లో శనివారం రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం సోదరులు నెల రోజులపాటు ఉపవాస దీక్ష చేపట్టారు. మాసం చివర రోజున నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలను ముగించారు. ముస్లిం గ్రామాలైన బోధిగల్లం, అప్పల పాయకరావుపేట తదితర గ్రామాల్లో మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

నక్కపల్లిలో ముస్లిము సోదరుల ఆనందక్షణాలు

కంచరపాలెం : జివిఎంసి 53వ వార్డు పరిధి మస్జిద్ – ఈ – అల్ ఖదిర్ మస్జిద్ – ఈ –అల్ పత లో ముస్లిం సోదరులు శనివారం ఈద్గా స్థలం వద్ద ఈద్–ఉల్–ఫితర్ నమాజ్ ఆచరించారు. వేకువ జామున ఫజర్ నమాజ్‌ను ఆచరించిన ముస్లిములు ఆయా మస్జిద్‌ల నుంచి ర్యాలీగా ఈద్గా స్థలాలకు చేరుకున్నారు. ముస్లిం మత గురువులు తక్రిర్ పాటించారు. ఖురాన్‌లో సూక్తులు వివరించారు. ముస్లిం సోదరులు ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమాన్ని మస్జిద్ కమిటీ అధ్యక్షులు మున్నా గౌస్ పర్యవేక్షించారు.

ఆరిలోవ : హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్ని మతాల పండుగలను జరుపుకోవడం, మతసామరస్యాన్ని చాటడంలో నార్త్ షిర్డి సాయిబాబా ఆలయ కమిటీ ముందుంటుంది. హిందూ పండగలతోపాటు రంజాన్, క్రిస్మస్ వేడుకలను ఇక్కడ జరుపుకుంటుంటారు. ఈ ఏడాది రంజాన్ సందర్భంగా ఆరిలోవలో ఉన్న జహీరుద్దీన్ స్నేహ బృందం, బంధు వర్గంప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలమాంబ కాంప్లెక్స్‌లో ఉన్న పోలమాంబ, షిరిడి సాయిబాబా, అయ్యప్ప స్వామి, సదాశివుడు, ఆంజనేయ స్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. అనంతరం ఖురాన్ పఠనం జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు, ఇతర కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన పురోహితులు నగేష్ శర్మ, ప్రభాష్, సిబిసిఐడి డిఎస్‌పి నాగేశ్వరి పాల్గొన్నారు. మధ్యాహ్నం ముస్లిం సోదరులు ఆలయంలో పేదలకు అన్నదానం జరిపారు. ముస్లిం సోదరులకు ఆలయ చైర్మన్ వానపల్లి అప్పారావు, కార్యదర్శి ఆర్ఏ పాత్రో సత్కరించారు.